# అంకెలు, సంఖ్యలు: ఆరు నుండి పది దాకా

వేమూరి వేంకటేశ్వరరావు

## ఆరు

'ఓల్గా నుండి గంగ దాకా' వచ్చేం. 'హంపీ నుండి హరప్పా దాకా' వెళ్ళేం. 'యువ నుండి యువ' దాకా పాడుకున్నాం. నేనేనేమిటి తక్కువ తిన్నాను? ఆరు నుండి పది దాకా రాస్తాను – చదవండి!

తెలుగులో ఉన్న 'ఆరు' మాటలన్నీ దరిదాపు సంస్కృతం నుండి దిగుమతి అయినవే.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అరిషడ్వర్గాలు– అంటే ఆరు శత్రువులు.

సనాతన ధర్మానికి మూలాధారమైన షడ్దర్శనాలని మూడు జంటలుగా చెప్పడం ఆచారం: న్యాయ, వైశేషికాలు; సాంఖ్య, యోగాలు, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంసలు.

షడ్రసాలు కూడ మూడు జంటలే – ఉప్పు, పులుపు; తీపి, కారం; చేదు, వగరు.

షట్పదం అంటే నిఘంటుకారుడు తుమ్మెద అని చెప్పేడు కానీ ఏ కీటకాన్ని అయినా ఈ పేరుతో పిలవచ్చు.

ఆరు ముఖములు ఉన్న కుమారస్వామి షడాననుడు.

షష్ఠి అంటే ఆరు, షష్టి అంటే అరవై అని గమనించమని ప్రార్థిస్తున్నాను.

పద్యానికి ఆరు పాదాల చొప్పున ఆరు పద్యాలుంటే దానిని ఇంగ్లీషులో 'సెస్టీనా' అంటారు. పాదానికి ఆరు మాత్రలు ఉన్న లేటిన్ ఛందస్సుని 'ఇయాంబిక్ హెక్సామీటర్' అంటారు.

షడ్భుజం అంటే ఆరు భుజాలు ఉన్న రేఖాగణితపు బొమ్మ. దీన్నే షట్కోణి అని కూడ అంటారు. ఇదే ఇంగ్లీషులో హెక్సగన్. మన దేశ రక్షణ విభాగానికి షడ్భుజి ఆకారంలో ఒక పెద్ద భవనం నిర్మించి దానికి 'హెక్సగన్' అని పేరు పెడితే అమెరికా వాడు తప్పకుండా ఉడుక్కుంటాడు.

అతివృష్టి, అనావృష్టి, మిడుతలు, పందికొక్కులు, చిలుకలు, చేరువ రాజులు – ఈ ఆరూ ఈతిబాధలు అని అంటారు కానీ ఇందులో చేరువ రాజులకి బదులు రాజకీయ నాయకులు అంటే బాగుంటుందేమో.

సముద్రంలో పడవ ఎక్కడ ఉందో తెలుసుకునే నిమిత్తం వాడే పరికరం వృత్తం యొక్క పరిధిలో ఆరో భాగం ఉన్న ఆకారంలో ఉంటుంది కనుక దానిని 'సెక్స్టెంటు' అన్నారు. విశ్వవిద్యాలయాలలో వాడే 'సెమెస్టరు' అన్న మాట 'సెమెస్ట్రిస్' అనగా ఆరు నెలలు అన్న లేటిన్ మాటనుండి వచ్చింది.

ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారుట.

గణితంలో 6 కి ఒక ప్రత్యేక స్థానం ఉంది. 6 యొక్క కారణాంకాలు 1, 2, 3. అంటే 1 నీ 2 నీ 3 నీ వేసి గుణిస్తే 6 వస్తుంది. తమాషా ఏమిటంటే 1 నీ 2 నీ 3 నీ వేసి కూడినా 6 వస్తుంది. ఈ లక్షణం ఉన్న సంఖ్యలని సంపూర్ణ సంఖ్యలంటారు. ఇంగ్లీషులో 'పెర్ఫెక్ట్' సంఖ్యలు అంటారు. ఆరు అన్నిటిలోకి చిన్న 'పెర్ఫెక్ట్' సంఖ్య. తర్వాత ఈ లక్షణం ఉన్న సంఖ్య 28. ఆ తర్వాత మూడవ సంపూర్ణ సంఖ్య 496. ఆ తర్వాత 8, 128. ఆ తర్వాత 33, 550,

336. ఆరవ సంపూర్ణ సంఖ్య 8, 589, 869, 056. ఇంకా ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే ఇంతవరకు మనకి తెలిసిన సంపూర్ణ సంఖ్యలన్నీ సరి సంఖ్యలే.

## ఏడు

ఏఁడు అంటే సంవత్సరం. ఏఁడు + ఆది = ఏఁడాది కనుక ఏడాది అంటే సంవత్సరాది, సంవత్సరానికి మొదటి రోజు. కనుక 'మా అబ్బాయికి ఏడాది నిండింది' అన్న ప్రయోగం తప్పు. 'మా అబ్బాయికి ఒక ఏడు నిండింది' అనాలి. ఇప్పుడు నేను ప్రస్తావించే ఏడు లో అర సున్న లేదు. ఇక్కడ ఏడు అంటే ఆరున్నొక్కటి.

ఏడు అన్నది ఏడ్పుకి సమానార్థకం కనుక కొందరి దృష్టిలో ఏడు కొంచెం అశుభం. అందుకనే ఆరునొక్కటి వాడుకలో ఉన్నది. ఎంత అశుభం అయినా పెళ్ళిళ్ళల్లో వధూవరుల చేత సప్తపదులు, అంటే ఏడడుగులు, తొక్కిస్తారు.

సప్తర్షి మండలంలో ఉన్న అరుంధతిని చూపిస్తే అరుంధతి కాదు కానీ ఆరు వేల అప్పు కనిపిస్తున్నాదన్నాడుట ఒక ప్రబుద్ధుడు.

''ఏడు కొండలవాడా! వేంకట రమణా! గోవిందా! గోవింద'' అనడంలో ఉన్న ఇంపు, సొంపు ''ఆరునొక్క కొండల వాడా!'' అని అరిచి చచ్చినా రాదు.

ఈ ఏడుని వాడడం ఇష్టం లేకనో ఏమో కుండలినీ యోగంలో ఉన్న ఏడు చక్రాలనీ షట్చక్రములు అని ఉంటారని నా సిద్ధాంతం. కుండలినిలో, అడుగు నుండి మీదకి చక్రాల పేర్లు ఇవి: మూలాధార, స్వాధిష్టాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, అజ్ఞ, సహస్రార.

ఈ ఏడు శబ్దం వాడడంలో ఏమాత్రమూ అభ్యంతరం లేని పాశ్చాత్యులు ఎందుకనో సరిగమపదని అనే సప్తస్వరాలని 'ఆక్టేవ్' అన్నారు – అంటే ఎనిమిది మాత్రల కాలం అని అర్థం.

సప్తర్షులని, సప్త సముద్రాలనీ, సప్తద్వీపాలనీ వర్ణించిన మన వాళ్ళు ఇంద్ర ధనుస్సులో ఉన్న ఏడు రంగులని సప్తవర్ణములని చెప్పక పోవడం కొంచెం సోచనీయమే.

గణితంలో 7 కి ఒక ప్రత్యేకత ఉంది. ఒకటిని ఏడు చేత భాగించగా వచ్చే లబ్దాన్ని చూడండి.

0 . 142857 142857 142857 ...

ఇక్కడ దశాంశ బిందువు తర్వాత వచ్చే అంకెలు ఆరేసి చొప్పున పదే పదే పునరావృతం అవుతున్నాయి, చూసేరా? ఇప్పుడు ఇలా పునరావృతం అవుతూన్న ఆరు అంకెలని తీసుకుని ఆ సంఖ్యని 2, 3, 4, 5, 6 ల చేత గుణిద్దాం. ఇక్కడ గుణకారానికి నక్షత్రం గుర్తు వాడతాను.

142857 * 2 = 285714

142857 * 3 = 428571

142857 * 4 = 57142[illegible]

142857 * 5 = 71428[illegible]

142857 * 6 = 85714[illegible]

తమాషా ఏమిటంటే కుడి చేతి పక్క ఉన్న గుణకార ఫలాలన్నిటిలోనూ 1, 2, 4, 5, 7, 8 అనే అంకెలే రకరకాల అమరికలలో పదే పదే ప్రత్యక్షం అవుతున్నాయి.

ఎనిమిది

"ఓం నమో నారాయణాయ" అనే తారక మంత్రం అష్టాక్షరిగా వ్యవహరించబడుతోంది.

ఎనిమిది పాదాలు ఉన్న శ్లోకం అష్టపది. ఎనిమిది పద్యాలున్న స్తోత్రాన్ని అష్టకం అంటారు.

ఎనిమిది పాదాలున్న సాలెపురుగునీ అష్టపది అనే అనాలి, కాని ఎవ్వరూ అలా అనడం నేను విన లేదు. అష్టపాది అంటే సరిపోతుందేమో.

బుద్ధునిది అష్టాంగ మార్గం. ఈ అంగాలు ఏమిటయ్యా అంటే సమ్యగ్దృష్టి, సమ్యస్సంకల్పం, సమ్యగ్వాక్కు, సమ్యక్కర్మ, సమ్యగ్జీవనం, సమ్యగావ్యయామం, సమ్యక్‌స్మృతి, మరియు సమ్యక్సమాధి.

ఎనిమిది శరీరావయవాలతో చేసే నమస్కారమే సాష్టాంగనమస్కారం.

అష్టార్ఘ్యాలు, అష్టకష్టాలు, అష్టకర్మలు, అష్టగణపతులు, అష్టలక్ష్ములు, అష్టదిక్పాలకులు, అష్టదిగ్గజాలు... ఇలా ఎన్నో అష్ట మాటలు మన భాషలో ఉన్నాయి.

పాణిని రచించిన వ్యాకరణగ్రంథంలో ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి కనుక దానిని అష్టాధ్యాయి అంటారు.

అష్టభాషలైన సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని, మాగధి, పైశాచి, చూళికా పైశాచి, అపభ్రంశం, తెలుగు లలో తెలుగు ఉండడం గమనించదగ్గ విషయం.

తెలుగంటే జ్ఞాపకం వచ్చింది. ఒక్క తెలుగు భాషలోనే అష్టావధానం అనే ప్రక్రియ ఉంది. అష్టావధానం చేసే అష్టావధానులకి అమెరికాలోని ఆంధ్రులలో ఉన్న పలుకుబడి ఇండియాలో ఉన్నట్టు కనిపించదు.

'అష్టవర్షా భవేత్ కన్యా' అన్న శ్లోకం చదివి, ముక్కుపచ్చలారని అమ్మాయిలకి పెళ్ళిళ్ళు చేసేసి వాళ్ళని అష్టకష్టాలు పెట్టేసేరు, మనవాళ్ళు.

అష్టవంకరలున్న అష్టావక్రుడు కథలోనే ఈ ప్రపంచం ఎంత పురాతనమైనదో తెలియచెప్పే మంచి పిట్టకథ ఒకటి ఉంది. ఈ అష్టావక్రుడి తండ్రి ఏకపాదుడు!

అష్టాచెమ్మ అనే ఆటలో అష్టా అంటే ఎనిమిది కనుక 'చెమ్మా' అంటే నాలుగు అయిఉంటుందని ఊహిస్తున్నాను.

మన ధర్మశాస్త్రాలు ఎనిమిది రకాల వివాహాలని ఆమోదించేయి. ఇందులో గాంధర్వం, రాక్షసం మనకి తెలుసు కానీ మిగిలిన వాటి సంగతి అంతగా తెలియదు.

అసలు ఎనిమిదికి భారత భాగవత కథలలో కొంత ప్రాముఖ్యత ఉంది. అష్టవసువులలో ఎనిమిదవ వాడే భీష్ముడు. శ్రీకృష్ణుడు దశావతారాలలో ఎనిమిదవ అవతారం. దేవకి వసుదేవుల ఎనిమిదవ సంతానం. అష్టమినాడు పుట్టేడు.

ఆక్టేవ్‌లో నిజానికి ఉండే స్వరాలు ఏడు అని చెప్పేను కదా! ఎనిమిది వస్తువులు కలిసిన గుంపుని 'ఆక్టెట్' అంటారు. కంప్యూటర్ రంగంలో ఎనిమిది ద్వింకము (ద్వియాంశ అంకము) ల గుంపుని 'బైట్' అంటారు. అదే ఎనిమిది ద్వింకముల గుంపుని 'కమ్యూనికేషనన్స్' శాస్త్రంలో 'ఆక్టెట్' అంటారు.

తొమ్మిది

తొన్ను + పది = తొమ్మిది కనుక ఈ మాట వాచ్యార్థం 'పది కంటె ఒకటి తక్కువ'. ఇక్కడ జరిగిన సంధి తెలుగు సంధో, సంస్కృత సంధో, ఈ సంధి పేరేమిటో వగైరా విషయాలు నాకు తెలియవు.

'నవ' అన్న మాటకి మూడర్థాలు ఉన్నాయి: కొత్త, తొమ్మిది, దురద. ఈ మూడర్థాలతోటీ ఏమీ సంబంధంలేని 'నవ' మాటలు కూడ ఉన్నాయి. ఉదాహరణకి కృష్ణా జిల్లాలో వాడుకలో ఉండే నవటాకు అంటే సేరులో ఎనిమిదో వంతు – తొమ్మిదో వంతు కాదు. ఇదే విధంగా 'నవరసు' లో 'నవ' నేతిబీరకాయలో నెయ్యి లాంటిది. నవరసు అనే మాట 'సావరిన్' అనే ఇంగ్లీషు మాటకి భ్రష్ట రూపం. ఇదే విధంగా నవాబు, నవారు, నవాసారం అనే మాటలకి కొత్తదనంతో కాని తొమ్మిదితో కాని, దురదతో కాని ఏమీ సంబంధం ఉన్నట్లు తోచదు.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి లగాయతు నవమి వరకు కల రాత్రులని నవరాత్రులు అంటారు. మన పండుగలలో నవరాత్రులు చాల ముఖ్యమైనవి.

నవగ్రహాలలో ఒకటైన ప్లూటో గ్రహం కాదని ఆమధ్య కొందరు వాదించేరు. అప్పుడు జామాతా నవమగ్రహః అనాలో ఏమిటో అని నేను కంగారు పడ్డ మాట మాత్రం వాస్తవం. కాని, ఆ వాదం వీగి పోయి ప్లూటోని గ్రహం కిందే లెక్కిద్దామని సమాధాన పడ్డారు పెద్దలు. ప్లూటో గ్రహం అయినా కాకపోయినా మనం చేసుకునే నవగ్రహ పూజలకి ఢోకా లేదు. మనం ప్లూటోనే కాదు, యూరెనస్ ('యురేనస్' అన్నది సరి అయిన ఉచ్చారణ కాదు) ని కూడ ఎప్పుడూ నవగ్రహాలలో లెక్కించ లేదు. కనుక ఇబ్బందే లేదు.

జాతకాలు రాసేటప్పుడు నవాంశ అనే భావం తరచు వస్తూ ఉంటుంది.

నవజని లో 'నవ' అంటే తొమ్మిదీ కాదు, కొత్తా కాదు. నవాసారం, సున్నం కలపగా వచ్చే అమ్మోనియావాయువుని నవజని అని అనమని భవదీయుడి సలహా.

నవామ్లం అనే మాట 'ఎమీనో ఏసిడ్' కి నా తెలుగు సేత. ప్రాణ్యాలనే గొలుసులలో ఎమీనో ఏసిడ్‌లు పూసల లాంటివి. ఈ పూసలు గుండ్రంగా, చక్రీయ సౌష్టవంతో ఉండకుండా, గురివింద గింజ మాదిరి ఉన్నాయని ఊహించుకుంటే అప్పుడు ఎర్రగా ఉన్న మొన ఎమీన్ శీర్షం, నల్లగా ఉన్న మొన ఆమ్ల శీర్షం అవుతాయి. 'ఎమీన్' అనే మూల పదం అమ్మోనియా నుండి వచ్చింది కనుక ఎమీన్ శీర్షం నవ శీర్షం అయింది. దీన్ని ఆమ్లశీర్షంతో జోడిస్తే నవామ్లం వచ్చింది.

పూర్వం, రోజుకి పన్నెండు గంటలే ఉండే రోజులలో, తొమ్మిదో గంటలో (ఇప్పటి లెక్క ప్రకారం మధ్యాహ్నం మూడు) చేసే దేవతార్చనని లేటిన్ లో 'నోను' అనేవారు. ఇదే ఇంగ్లీషులో 'నూన్' అయింది. తెలుగులో 'నోము' ఇందులోంచే వచ్చిందేమో? (లేదు, ఏదో సరదాకి అంటున్నాను.)

గణితంలో తొమ్మిదికి ప్రత్యేక స్థానం ఉంది. తొమ్మిదిని ఉపయోగించి రకరకాల లెక్కలు, 'ట్రిక్కు'లు చెయ్యవచ్చు. ఉదాహాణకి ఒక సంఖ్యలోని అంకెల మొత్తం 9 కి గుణకం అయితే ఆ సంఖ్యని 9 చేత భాగించ గలం. మరొక ట్రిక్కు.

ఏదైనా ఒక సంఖ్యని తీసుకోండి. మచ్చుకి 26 అనుకుందాం. దీన్ని తిరగెయ్యగా 62. ఈ రెండింటిలోనూ పెద్ద సంఖ్య నుండి చిన్న సంఖ్యని తీసివేద్దాం. ఈ తేడా 36. ఈ 36 ని 9 చేత నిశ్శేషంగా భాగించవచ్చు! మరొక జతతో మీరు ప్రయత్నించి చూడండి. ముత్యం మూడో ట్రిక్కు. ఈ 9 ని 1 చేత, 2 చేత, 3 చేత, అలా... గుణించగా వచ్చిన లబ్ధాలు 9, 18, 27, 36,... వగైరా కదా. చూడండి, ఈ లబ్ధాలలో ఉన్న అంకెలని కూడగా వచ్చే మొత్తం ఎల్లప్పుడూ తొమ్మిదే!

నాలుగో ట్రిక్కు. ఇక్కడ 1 నుండి 9 వరకూ ఉన్న అన్ని అంకెలనీ వరసగా పేర్చగా వచ్చిన సంఖ్యని 9 చేత గుణించగా వచ్చే సంఖ్యలో తొమ్మిది ఒకట్లు ఉంటాయి. 123 456 789 * 9 = 1111 1110 1. మధ్యలో పుల్లారిబుడ్డిలా సున్న వచ్చి అందాన్ని చెడగొట్టింది. కనుక మరొక ట్రిక్కు ప్రయత్నిద్దాం. కింది లెక్కలు చూడండి.

0 * 9 + 1 = 1
1 * 9 + 2 = 11
12 * 9 + 3 = 111
123 * 9 + 4 = 111 1
1234 * 9 + 5 = 111 11
12345 * 9 + 6 = 111 111
123456 * 9 + 7 = 111 111 1
1234567 * 9 + 8 = 111 111 11
12345678 * 9 + 9 = 111 111 111
123456789 * 9 + 10 = 111 111 111 1

'నవాధికేన' అనే సూత్రం ఉంది. దీన్ని ఇంగ్లీషులో 'కేస్టింగ్ అవుట్ ద నైన్స్' అంటారు. ఉదాహరణకి 239 ని 4649తో గుణించగా వచ్చిన లబ్ధం 111 111 1 అని ఎవరో చెప్తారు. ఈ లెక్క సరిగా ఉందా లేదా అని చూడాలంటే 'నవాధికేన' సూత్రం ఇలా ఉపయోగిస్తాం. మొదట 2, 3, 9 కూడగా 14 వచ్చింది. ఇందులోంచి 9 తీసెయ్యగా 5. ఇదే విధంగా 4, 6, 4, 9 కూడగా 23. ఇందులోంచి 9 రెండు సార్లు తీసెయ్యగా 5. ఇప్పుడు ఈ రెండు 5 లనీ గుణిస్తే 25. ఈ 2, 5 కలపగా 7. ఇందులోంచి 9 తీసెయ్యలేము కనుక 7 ని అలా వదిలేద్దాం. లబ్ధంలో ఉన్న అంకెలని కూడగా 7. రెండు పద్ధతులలోనూ ఒకే సమాధానం వచ్చింది కనుక ఈ లెక్క మూడొంతులు తప్పు కాదు అని చెప్పవచ్చు. ఖరాఖండీగా ఒప్పు అనీ చెప్పడానికి వీలు లేదు. దీనికి కారణాలు గ్రంథవిస్తరణ భీతి చేత ఇక్కడ చెప్పదలుచుకోలేదు. కుతూహలం ఉన్న వారు మెదడుకి మేత వేసి చూసుకోవచ్చు.

గణితంలోనే కాకుండా మన ప్రాచీన సంస్కృతిలో తొమ్మిదికి చాల ప్రత్యేకమైన స్థానం ఉంది. రెండు చిన్న ఉదాహరణలు ఇస్తాను. 108 మనకి చాల పవిత్రమైన సంఖ్య. దేవుడిని అష్టోత్తరశత (108) నామాలతో స్తుతిస్తాం. ఉపనిషత్తులు కూడ 108. ఈ 108 లో ఉన్న మూడు అంకెలని కలపగా వచ్చే మొత్తం 9. మరొక ఉదాహరణ. మన కలియుగం కాలావధి 416,000 సంవత్సరాలు. ఈ 432,000 లో ఉన్న అంకెలని కూడగా వచ్చే మొత్తం 4 + 3 + 2 = 9. ద్వాపరయుగం దీనికి రెండింతలు, లేదా 864,000 సంవత్సరాలు. ఈ సంఖ్యలో ఉన్న అంకెలన్నిటిని కలిపితే వచ్చే మొత్తం 8 + 6 + 4 = 18. ఇప్పుడు ఈ 18లో ఉన్న రెండు అంకెలనీ కలిపితే 1 + 8 =9. పోతే త్రేతాయుగం కలియుగానికి మూడింతలు కనుక త్రేతాయుగం వ్యవధి 1, 296, 000 ఏళ్ళు. ఈ సంఖ్యలోని అంకెల మొత్తం 1 + 2 + 9 + 6 = 18. మళ్ళా మరొకసారి కలిపితే 1 + 8 = 9. కృతయుగం పొడుగు కలియుగానికి నాలగింతలు, లేదా 1, 728, 000 = 18, వెరసి 9. తమాషాగా లేదూ. తమాషాయే కాదు. ఈ యుగాలు ఇంతింత పొడుగుండాలని లెక్కల పిచ్చి ఉన్న వ్యక్తి ఎవరో నిర్ణయించేరన్న అనుమానం రావడం లేదూ?

ఈ కథ ఇక్కడితో అయిపోతే ఇది చెప్పుకోదగ్గ విశేషమే కాదు. పైన చెప్పిన నాలుగు యుగాలు ఒక సారి గడిస్తే అది మహాయుగం కనుక ఒకొక్క మహాయుగం పది కలియుగాల కాలంతో సమానం. అవునా? కనుక మహాయుగంలో 4,320,000 సంవత్సరాలు. ఈ సంఖ్యలో ఉన్న అంకెల మొత్తం 9. మరికొంచెం ముందుకు వెళదాం. ఒక కల్పంలో 71 మహాయుగాలు ఉన్నాయి. కనుక కల్పంలో 306,720,000 సంవత్సరాలు. ఈ సంఖ్యలో ఉన్న అంకెలని కూడితే 3 + 6 + 7 + 2 = 18. మళ్ళా కలిపితే 9. ఈ కల్పం బ్రహ్మదేవుడి పగలుతో సమానం. ఈ పగలు అయిపోగానే ప్రళయం వచ్చి సృష్టి అంతా లయమైపోతుంది. ఇలాంటి కల్పమే బ్రహ్మ రాత్రి. మళ్ళా 'తెల్లవారేసరికి' సృష్టి పునఃప్రారంభం అవడానికి కావలసిన హంగులన్నీ సమకూర్చుకొనడానికి ఈ 'బ్రహ్మ రాత్రి' కాలం పడుతుంది. ఈ లెక్కలన్నిటిలోనూ 9 పదే పదే రావడం గమనార్హం.

పది

మన దేశంలో కనిపెట్టబడ్డ దశాంశ పద్ధతికి పది మూలం.

దిక్కులు నాలుగు అనీ, ఎనిమిది అనీ అన్నప్పుడు ఈ ప్రపంచం ద్వీమాత్రకం ('టు డైమెన్షనల్') అనిన్నీ, 'దశ దిశలు' అన్నప్పుడు ఈ ప్రపంచం త్రిమాత్రకం ('త్రీ డైమెన్షనల్') అనిన్నీ ఒక భావం అంతర్లీనంగా కనిపిస్తుంది. కాని ఐన్‌స్టయిన్ వచ్చి ప్రపంచం చతుర్మాత్రకం అన్నాడు. ఈ చతుర్మాత్రకమైన ప్రపంచంలో దిక్కులెన్నో?

దశ కంఠుడైన రావణుడిని దశరథుడి కొడుకూ, దశావతారాలలో ఒకడూ అయిన రాముడు సంహరించేడు.

పంచపాండవులలో మూడోవాడైన అర్జునుడికి పది పేర్లు ఉన్నాయి.

రూపాయిలో నాలుగోవంతుని పావులా అన్నట్లే డాలర్లో పదో వంతుని 'డైమ్' అంటారు.

విద్యావంతులలో పదిమందికి నాయకుడు అనదగ్గ పెద్దవాడు 'డీన్.'

పూర్వం రోమ్ పంచాంగంలో పది నెలలే ఉండేవి. ఐదో నెల అయిన క్వింటిల్లిస్ ని జూలియస్ సీజర్ గౌరవార్థం జూలై కింద మార్చేరు. ఆ తర్వాత ఆరో నెల అయిన సెక్స్టిల్లస్ ని అగస్టస్ సీజర్ పేరున ఆగస్టు అన్నారు. ఏడో నెల సెప్టెంబరు, ఎనిమిదో నెల అక్టోబరు, తొమ్మిదోది నవంబరు, పదోది డిసెంబరు గా ఉండేవి. ఈ పేర్లు ఇలా ఉంటే పేరు వినగానే అది ఎన్నో నెలో గభీమని తెలిసేది. ఈ రాజకీయ నాయకుల పుణ్యమా అని ఇదంతా తిరకాసయి, అన్నీ రెండు నెలలు వెనక్కి జరిగి, తొమ్మిదో నెల సెప్టెంబరు, పదో నెల అక్టోబరు, పదకొండోది నవంబరు, పన్నెండోది డిసెంబరు గా వర్థిల్లుతున్నాయి – ఈ రోజులలో.